## క్లుప్తంగా

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న క్రీడాకారులు

**హత్నూర(సంగారెడ్డి):** హత్నూర గ్రామ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నమెంట్‌లో 9 జట్లు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు ఆరు రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో హత్నూర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండో సంవత్సరం టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

**నారాయణఖేడ్:** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటోళ్ల కిష్టారెడ్డి (పీకేఆర్)ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రిలియంలీగ్ క్రికెట్ పోటీలను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు దసరా సెలవులను వృథా చేసుకోకుండా క్రికెట్ టోర్నీని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. పురపాలిక చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్, నర్సింహులు, మాజీద్, హన్మాండ్లు, రామకృష్ణ, సద్దాం, మాజీ ఎంపీపీ జీవులానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి



కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్

**నారాయణఖేడ్:** సిద్దిపేట జిల్లా, గురువన్న పేటలో బాలికపై జరిగిన అత్యాచార ఘటన దారుణమని నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు జి.ఎస్. ప్రభాకర్ అన్నారు. బాలికపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### వ్యక్తి అదృశ్యం



అంజయ్య (ఫైల్)

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కోనాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. కోనాపూర్‌కు చెందిన గోపులారం అంజయ్య(77), ఈ నెల 3న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### నేడు చండీహోమం

**పటాన్‌చెరుటౌన్:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానంలో అమ్మవారికి మహా ఒడిబియ్యం సమర్పణ, అన్నదానం, సా.4 గంటలకు చండీహోమం ఉంటుందని ఆలయ అర్చకులు మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో ఆదివారం భజరంగ్‌దళ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ కమిటీ సభ్యులు మధురనేని శేషాద్రి, భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

**తూప్రాన్:** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూరుకు చెందిన వ్యక్తి తూప్రాన్‌లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెంటూరుకు చెందిన కొండూరు శ్రీశైలం(45) తూప్రాన్‌లో టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# మహా చండీగా..

దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారు తొమ్మిది రోజులు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తోంది. నాల్గొవ రోజూ అమ్మవారు మహాచండీ దేవిగా దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆయా దేవాలయాలు, మండపాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పారాయణాలు, కుంకుమార్చన అన్నదానం నిర్వహించారు. –సాక్షి నెట్‌వర్క్




ఝరాసంగం(జహీరాబాద్): పూజలు చేస్తున్న సీఐ, ఈఓ, తదితరులు



సంగారెడ్డిటౌన్ : అన్నపూర్ణదేవిగా..



రాయికోడ్: అన్నపూర్ణాదేవి అలంకరణలో..



సదాశివపేట: కన్యకపరమేశ్వర మందిరంలో..



సదాశివపేట గాంధీచౌక్ వద్ద..



సదాశివపేట: సిద్దాపూర్ కాలనీలో..



న్యాల్‌కల్ : మహాచండీ రూపంలో..



జహీరాబాద్ టౌన్: తొమ్మిది అవతారాల్లో చిన్నారులు



పటాన్‌చెరు టౌన్: అన్నపూర్ణేశ్వరిగా ..



మునిపల్లి(అందోల్): ఖమ్మంపల్లిలో..

# వైభవంగా భవానీ శక్తిపీఠ పడిపూజ



పడిపూజ చేస్తున్న ధర్మకర్త కిషన్‌సింగ్ దంపతులు

**కల్హేర్(నారాయణఖేడ్):** నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా (భక్తిధాం తండా)లో శనివారం రాత్రి భవానీ మాత శక్తిపీఠ పడిపూజ వైభవంగా నిర్వహించారు. ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి మూడ్‌కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ నేతృత్వంలో అమ్మవారికి హారతి, తీర్థప్రసాదం, భజన, అన్నదానం, ఇతర కార్యక్రమలు చేపట్టారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని తండాలకు చెందిన దీక్షదారులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చేందర్, బంజార సేవలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి సంగీత కార్యక్రమం ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

**జహీరాబాద్ టౌన్:** దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని జహీరాబాద్ భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భజన పోటీలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది భజన పోటీలకు బదులుగా భక్తి సంగీతం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాకారులు, సినీ సంగీత గాయకులు పాల్గొన్నారు. భక్తి సంగీత కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం భజన పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం సంగీత కళాకారుల ద్వారా ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చక్కని ప్రదర్శనిచ్చిన కళాకారులకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు.

# పుణ్యక్షేత్రాలకు తరలిన దీక్షాధారులు



దీక్షాధారులను సన్మానించిన మశ్చేందర్

**నారాయణఖేడ్:** మండలం పరిధిలోని నమ్లిమెట్ పంచాయతీ పరిధిలోని పలు గిరిజన తండాలకు చెందిన సేవాలాల్ మహరాజ్, భవానీమాత దీక్షాధారులు ఆదివారం మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన పౌరాదేవిలోని సేవాలాల్ మహరాజ్, భవానీమాత ఆలయాలు, పండరీపూర్‌లోని రుక్మిణి పాండురంగ ఆలయం, తుల్జాపూర్‌లోని దుర్గాభవానీమాత ఆలయాలను దర్శించుకునేందుకు బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు ఖేడ్ జంట గ్రామమైన భవానీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రవాసభారతీయుడైన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపుమశ్చేందర్ దీక్షాధారులను సన్మానించి, జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.



# 'ఎమ్మారై స్కానింగ్' ఏర్పాటు చేయండి



ఎంపీను సన్మానిస్తున్న నర్సింహారెడ్డి

**పటాన్‌చెరు టౌన్:** ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఎమ్మారై స్కానింగ్ ఏర్పాటు చేయాలని ఎంపీ సురేష్ షట్కార్‌కు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామచంద్రపురం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఎమ్మారై స్కానింగ్ లేకుండా కార్మికులు వారి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం వైద్యులు సనత్‌నగర్ ఈఎస్‌ఐ ఆస్పత్రికి సిఫారసు చేస్తున్నారని తెలిపారు. రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎంపీకి వివరించారు. స్పందించిన ఎంపీ, కచ్చితంగా ఈఎస్‌ఐ డైరెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# ఓబన్న ఆశయ సాధనకు కృషి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధు

కాంగ్రెస్ నేత మధు ముదిరాజ్

**పటాన్‌చెరు టౌన్:** వడ్డే ఓబన్న ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో ఆదివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న వర్ధంతి కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని, పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి కోసం తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన మన రేనాటి వీరుడు వడ్డే ముద్దుబిడ్డ అని అన్నారు. వడ్డేరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి జెరిపాటి జైపాల్‌ని చైర్మన్‌గా నియమించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ సందర్భంగా నీలం మధుని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, మాజీ సర్పంచ్ రవీందర్, కృష్ణ, వెంకటేశ్, సతీష్, రమేష్, కుమార్, నరేష్, వైకుంఠం, సైదులు ,వెంకన్న, మహేశ్, అజయ్ పాల్గొన్నారు.

# బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

**కల్హేర్(నారాయణఖేడ్):** బీజేపీలో చేరి దేశ అభివృద్ధికి సహకరించాలని ఆ పార్టీ సభ్యత్వ కమిటీ జిల్లా సభ్యుడు ప్రసాది రవిశంకర్ అన్నారు. ఆదివారం కల్హేర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రజల నుంచి సంపూర్ణమైన మద్దతు లభిస్తోందని, పార్టీలో చేరేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. మహా సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో అందరూ పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మండల అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, మండల ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంగమేశ్వర్‌రావు విఠల్, కిష్టయ్య రాజు పాల్గొన్నారు.

# విరిగిన స్తంభాలు..



**కౌడిపల్లి(నర్సాపూర్):** ప్రమాదవశాత్తు స్తంభాలు విరిగిపడ్డ సంఘటన మండలంలోని రాజిపేట పరిధిలోని గాయరగూడెం వద్ద ఆదివారం జరిగింది. గాయరగూడెంలో ఓ ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్టును కొట్టే క్రమంలో చెట్టు విద్యుత్ తీగలపై పడింది. దీంతో రెండు స్తంభాలు విరిగి కింద పడ్డాయి. ఈ సమయంలో జనం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు వెంటనే కొత్త స్తంభాలను వేశారు.

### అచేతన స్థితిలో అంధుడు



**జహీరాబాద్:** పట్టణంలోని ఏరియా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని అంధ వ్యక్తి అచేతన స్థితిలో ఉన్నాడు. గత మూడు సంవత్సరాల నుంచి అన్నదాన సేవా సమితి ద్వారా ఆహారం తింటూ జీవనం సాగించాడు. గత వారం రోజుల నుంచి అనారోగ్యం సమస్యతో అచేతనంగా పడి ఉన్నాడు. తన పేరు రమేష్ అని, ఝరాసంగం మండలంలోని ఎల్గోయ్ గ్రామంగా చెబుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. బంధువులు ఎవరైనా ఉంటే ఆస్పత్రికి రావాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరారు.

### దొంగల హల్‌చల్

**పటాన్‌చెరు టౌన్:** నాలుగు ఇళ్లలో దొంగలు హల్‌చల్ సృష్టించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు శాంతినగర్ కాలనీలో శనివారం రాత్రి ఎవరూ లేని సమయంలో ఇళ్ల తాళాలు పగులగొట్టి సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. మిగతా ఇళ్లలో దొంగతనం జరగలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### తీరనున్న డ్రైనేజీ సమస్య

**జహీరాబాద్:** కోహీర్ మండలంలోని పిచరాగడి తండాలో కె.ప్రసాద్‌రెడ్డి స్వచ్ఛందంగా నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ పనులకు మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ఆదివారం తండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాల్లో ప్రసాద్‌రెడ్డి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. తండాలో డ్రైనేజీ ఇబ్బందులను దూరం చేసేందుకు గాను అండర్ డ్రైనేజీ కాలువలను నిర్మించేందుకు ముందుకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. సొంత ప్రాంతానికి సేవలందించడం గొప్ప విషయమన్నారు.

### తుల్జాపూర్‌కు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న పాండునాయక్ బృందం

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** మండలంలోని మద్దికుంట తండా నుంచి మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు ఆదివారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండునాయక్ ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా పాండునాయక్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాదయాత్రగా వెళ్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేరుపై పూజలు చేయించి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. పాడిపంటలతో రైతులు సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటామని చెప్పారు. పాదయాత్రలో దేవిదాస్, నవీన్, గణేష్, రమేష్ తదితరులున్నారు.

# రామాలయ నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నగేష్ షెట్కార్ తదితరులు

**నారాయణఖేడ్:** పట్టణంలోని విశిష్ట చరిత్ర గల పురాతన రామాలయ పునర్నిర్మాణం, కల్యాణమండప పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆయా నిర్మాణాలకు దాతలుగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఆయన సోదరుడు ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్షెట్కార్ కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్నారు. ఆదివారం పనులను నగేష్ షెట్కార్, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్ చౌహాన్, ఆలయ కమిటీ సభ్యులు పాండు, నాయకులు కొండల్‌రెడ్డి, మాణిక్‌రావు పరిశీలించారు.

# సమస్యలపై పోరాడేది సీపీఎం నేతలే..

**కొండాపూర్(సంగారెడ్డి):** ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఎం నేతలేనని ఆ పార్టీ మండల కార్యదర్శి రాజయ్య పేర్కొన్నారు. మండలంలోని ఎదురుగూడెంలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. అధికార పార్టీ ఎన్నికల సందర్భంగా అనేక వాగ్దానాలు చేసి, గద్దెనెక్కిన తరువాత ప్రజలను విస్మరించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, ఉద్యోగుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అంబాని, ఆదాని లాంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. పేదలకు భూములు పంచింది. ఇళ్ల స్థలాల కోసం పోరాడిం సీపీఎం నేతలేనని తెలిపారు. సీపీఎం జిల్లా మహా సభలు అక్టోబర్ 19, 20 తేదీల్లో జహీరాబాద్‌లో జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహారెడ్డి, మండల కమిటీ సభ్యుడు మహిపాల్ రెడ్డి, ప్రభాకర్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.